క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో విజయం సాధించి సత్తాను చాటారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, పీడీ రోజా వివరాల మేరకు.. గత నెల 28 నుంచి 30 వరకు ఏలూరు జిల్లా పెదవేగి గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో గురుకుల పాఠశాల విద్యార్థినులు డిస్కస్ త్రోలో వి.స్వప్న ద్వితీయ స్థానంలో, షాట్‌పుట్‌లో కోవేల ద్వితీయ స్థానంలో విజయం సాధించారు. ఖోఖోలో వరలక్ష్మి, మహేశ్వరి, పల్లవి, లక్ష్మిభవ్య, బంగారు, ప్రశాంతి, పావని, రేవతి, అమృత వర్షిని, ఐశ్వర్య, నందిని, శ్యామ్ స్వర్ణలు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రుచికరమైన భోజనాన్ని వడ్డించండి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెను ప్రకారం రోజు రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జీబీ హళ్లి, అలుపనపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నిర్ధరించిన మేరకు పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పెనుకొండ: రూ.80 వేల విలువజేసే కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల మేరకు గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్ వద్ద దాడులు నిర్వహించామన్నారు. అ ప్రాంతంలోని ఎం. తిమ్మప్ప అనే వ్యక్తి ఇంటి పరిసరాల్లో సోదాలు నిర్వహించగా 20 బాక్సుల్లో (1920 టెట్రా చిన్న సైజు ప్యాకెట్లు) కర్ణాటక మద్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కర్ణాటక మద్యం అమ్మకూడదని, ఎవరు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్.రాజశేఖర్, రాముడు, జనార్దన్, రమేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ కోర్సులో ఉచిత శిక్షణ

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈ నెల 5 నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికేట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలలోని స్కిల్ హబ్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ 9676706976ను సంప్రదించాలన్నారు.

మడకశిరలో జడివాన



మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

మడకశిరరూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి మడకశిర ప్రాంతంలో జడివాన పడుతునే ఉంది. చలికి వృద్దులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎక్కువ మంది ఇంటికే పరిమితమైయ్యారు. కోతకు వచ్చిన వరి పంట గింజలు నేలకు రాలుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అక్రమాలకు హాయివే

- చిలమత్తూరు సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలకు మంగళం
- జోరుగా సాగుతున్న అక్రమ రవాణా
- సాఫీగా సరిహద్దు దాటించేస్తున్న 'తమ్ముళ్లు'
- రాష్ట్రంలోకి సులువుగా చేరుతున్న మత్తు పదార్థాలు



సోమఘట్ట పాఠశాలలో దర్శనమిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు



తనిఖీలు లేని కొడికొండ సరిహద్దు చెక్‌పోస్ట్

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో అధికారులు తనిఖీలకు మంగళం పాడారు. ఒక్క వాహనాన్ని కూడా ఆపి తనిఖీ చేసే పరిస్థితి లేదు. సెబ్‌ను కాస్తా ఎక్సైజ్‌కు మార్చిన తర్వాత కనీసం తనిఖీలు నిర్వహించకపోవడంతో జాతీయ రహదారి యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. ముఖ్యంగా కర్ణాటక మద్యం, మత్తు పదార్థాలు, ఇసుక, కలప ఇలా అన్నింటినీ సరిహద్దు దాటించేస్తున్నారు.

ఎన్నికల ముగిసిన తర్వాత...

ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక నేతలు మొదలు బడా నేతల కనుసన్నల్లో అక్రమంగా ఇసుక, మద్యం రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి ప్రభుత్వంలో మద్యం ధరలు పెద్దగా తగ్గకపోవడం, కర్ణాటకలో దొరికే బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటక మద్యం రాష్ట్రంలోకి వస్తోంది. ముఖ్యంగా టెట్రా ప్యాకెట్లు కుప్పలు తెప్పలుగా తెచ్చేస్తున్నారు. మండలంలో జాతీయ రహదారి కాకుండా లింక్ రోడ్లు ఉండటంతో అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

జోరుగా ఇసుక తరలింపు

కూటమి ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక తరలించుకోవచ్చన్న ప్రభుత్వ ఆదేశాలు టీడీపీ పార్టీ నాయకుల పాలిట కల్పతరువుగా మారాయి. మండలంలోనే కాదు రాష్ట్రం దాటి కర్ణాటకకు ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలోనూ కూటమి నేతల మధ్య మనస్పర్థలు ఏర్పడి వాళ్లలో వాళ్లే ఘర్షణ పడ్డ ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. ఇక మండలంలోని నదులలో ఉండే ఇసుకను తోడేస్తూ సహజవనరులను సొంత లాభాలకు వినియోగించుకుంటున్నారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

విద్యార్థులే లక్ష్యంగా మత్తు పదార్థాలు

44వ నంబరు జాతీయ రహదారిపై రాష్ట్ర సరిహద్దులో కొడికొండ చెక్‌పోస్ట్ ఉంది. సాధారణంగా ఎంతో పటిష్ట భద్రత ఇక్కడ ఉండాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిరంతరం నిఘా ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పరిస్థితి మారింది. కొడికొండ చెక్‌పోస్టులో తనిఖీలకు మంగళం పాడటంతో గంజాయి మొదలు ఇతర మత్తు పదార్థాలు రాష్ట్రంలోనికి సులభంగా ప్రవేశిస్తున్నాయి. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులే లక్ష్యంగా ఈ వ్యాపారం సాగుతోన్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలు వాడుతున్నారన్న సమాచారం సంచలనం రేపుతోంది. ఈ విషయం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల దృష్టికి వెళ్లడంతో సదరు విద్యా



ర్థులను మందలించారని విశ్వసనీయ వర్గాల సమాచారం. పాఠశాల విద్యార్థులంటే 14 – 15 ఏళ్లలోపే ఉంటారు. మరి పసి మనసులకు ఇలాంటి అలవాట్లు చేయించడం వెనుక ఎవరు ఉన్నారన్నది పోలీసులే తేల్చాల్సి ఉంది. అయితే ఇంత వ్యవహారం జరుగుతున్నా పోలీసు యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

స్థానిక చిలమత్తూరు పీఎస్‌కు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. సాధారణంగా పెద్ద మండలం కావడం, జాతీయ రహదారి ఉండటంతో సిబ్బంది 20 మందికిపైగా పోలీసు సిబ్బంది ఉండాలి. అయితే ప్రస్తుతం 12 మంది మాత్రమే ఉన్నారు. గత ప్రభుత్వంలో సెబ్ చెక్‌పోస్ట్ ఉండగా ఒక సీఐ, ఎస్ఐ , సిబ్బంది ఉండేవారు. దీంతో అప్పుడు ఈ కొరత కనిపించేది కాదు. ప్రస్తుతం ఇద్దరు ఎక్సైజ్ సిబ్బంది మాత్రమే చెక్‌పోస్ట్‌లో ఉంటున్నారు. దీంతో సివిల్ పోలీసులకు తలనొప్పిగా మారింది. దీనికి తోడు ప్రోటోకాల్ ఎక్కువగా ఉండటంతో అక్రమ రవాణాను అరికట్టడంతో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలున్నాయి. దీనికితోడు గ్రామాల్లో బెల్ట్‌షాపులకు టీడీపీ నేతలు అండ ఉండటంతో వాటి జోలికి వెళ్లడానికి కూడా పోలీసులు జంకుతున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

మత్తు పదార్థాలు, అక్రమ మద్యంతో పాటు సహజ వనరుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది. కూటమి నేతల ఆదేశాలతోనే అందరూ నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారన్న విమర్శలున్నాయి.

సిబ్బంది కొరత ఉంది

> మండలంలో అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అయితే 24 మంది ఉండాల్సిన స్టేషన్ హౌస్‌లో 12 మంది మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ ఎక్కడిక్కడ సమాచారం అందగానే తనిఖీ చేస్తున్నాం. పేకాట, మద్యం అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్త తీసుకుంటున్నాం.
>
> – మునీర్ అహ్మద్, ఎస్ఐ, చిలమత్తూరు

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

పెనుకొండ: ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలని పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బేగార్లపల్లి క్రాస్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ నాగసాయి ప్రసాద్ , ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓలు హేమలత, డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిర: మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏటీఎల్ మీనాక్షి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

14న మెగా లోక్ అదాలత్

- సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్

హిందూపురం: శాంతియుతంగా రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుని ప్రశాంత జీవనం సాగించాలని సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులు, కోర్టు సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన హిందూపురం న్యాయస్థానాల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఇరువర్గాలతో చర్చించి పరిష్కారమయ్యే దిశగా కృషిచేయాలన్నారు.



కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్షిస్తున్న న్యాయమూర్తులు

రాజీమార్గంతో పొందే ప్రయోజనాలను ఇరువర్గాలకు తెలియజేసి చొరవ చూపేలా చూడాలని కోరారు. నిర్దేశించిన లక్ష్యాలను పరిష్కారంలో పోలీసులు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నగేష్, పోలీసు అధికారులు, లోక్ అదాలత్ శారద, వివిధ న్యాయస్థానాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఘనంగా జ్యోతుల ఉత్సవం

పెనుకొండ: మండలంలోని దుద్దేబండ గ్రామంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే భక్తులు భక్తిశ్రద్ధలతో జ్యోతులు సమర్పించారు. అనంతరం మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీటిని విడుదల చేయించండి

మడకశిర: నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణాజలాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఆయన సోమవారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజినీర్లతో సమావేశమయ్యారు. మడకశిరకు కృష్ణా జలాలు అందించడంపై ఇంజినీర్లతో ఎమ్మెల్యే చర్చించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తెచ్చేలా ముడకశిర బ్రాంచ్ కెనాల్‌లోని కంప చెట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాన్నారు.

అర్జీల స్వీకరణ

గుడిబండ: తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ రాజు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖలకు పంపి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు.

చినుకు పడితే చిత్తడే



పెనుకొండ పరిధిలోని కోనాపురం రహదారిపై పారుతున్న వర్షపు నీరు



గుంతలమయంగా మారిన అమరాపురం మండలం తమ్మడేపల్లి రోడ్డు



రొళ్ల మండలం బీజీ హళ్లి హొసకట్ట వద్ద పూర్తిగా తెగిపడ్డ కల్వర్టు

రొళ్ల: మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా జడివాన కురుస్తోంది. ఈ నేపథ్యంలోనే బీజీ హళ్లికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలోని హొసకట్ట నిర్మించిన కల్వర్టు కూలింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. రొళ్ల నుంచి 7 కి.మీ ఉన్న బీజీ హళ్లికి వివిధ గ్రామాల గుండా 15 కి.మీ దూరం ప్రయాణించి చేరుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమరాపురం: మండలంలో తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు జడి వాన కురిసింది. అమరాపురం బస్టాండు బురదమయంగా మారింది. అలాగే తమ్మడేపల్లి నుంచి విరుపసముద్రం పోయే రోడ్డు బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పెనుకొండ: పట్టణంలోని కోనాపురం రహదారి జడివానతో బురదమయంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలమయం కావడం దీనికి తోడు వాన నీటితో నిండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

బ్యూటీషన్ కోర్సులో శిక్షణ

హిందూపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మూడు నెలల బ్యూటిషన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్, అడ్మిషన్లు జరుగుతున్నాయని డిసెంబర్ రెండో వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం పాలిటెక్నిక్ కాలేజీలో సెల్ నంబర్ 9704778737 ను సంప్రదించాలన్నారు.

బెళ్లిబట్లుకు బస్సు సర్వీసు

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి బెళ్లిబట్లు గ్రామానికి బెంగుళూరు నుంచి పావగడ మీదుగా కేఎస్ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. బస్సు ఉదయం 5 గంటలకు బెళ్లిబట్లు నుంచి బయలుదేరి పావగడ మీదుగా అదే రోజు రాత్రి 9 గంటలకు బెంగుళూరుకు చేరుకుంటుందని బస్సు డ్రైవర్ తెలిపారు.

పంటల బీమా చేయించుకోండి

లేపాక్షి: 2024–2025 సంవత్సరానికి మండల వ్యాప్తంగా పంటలు పెట్టిన రైతులు పంటల బీమాను చేయించుకోవాలని ఏఓ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం చెల్లింపునకు రైతులు నేరుగా బ్యాంక్ ద్వారా మాత్రమే చెల్లింపులు జరపాలన్నారు. 15 తేదీ వరకూ వేరుశనగ , టమాట పంటలకు, ఈనెల 31వ తేదీ వరకు వరి పంటకు ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మైనుద్దీన్

హిందూపురం టౌన్: హిందూపురం డిప్యూటీ తహసిల్దార్‌గా మైనుద్దీన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ వెంకటేశ్వర్లును కలెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సంక్షిప్త సమాచారం

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి



ఏపీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్న వీఓ, యానిమనేటర్స్‌ను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు, వీఏ, యానిమేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వెలుగు ప్రాజెక్ట్ ఏపీఎం రామాంజినేయులకు వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారులు రాజకీయ నాయకుల మాటలు విని 10 మందికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విధుల్లో నుంచి తొలగించారన్నారు. ఆన్‌లైన్‌లో కొత్త పేర్లు నమోదు చేశారన్నారు. పాత వారిని విధుల్లోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికై నా దీనిపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

పనులు పూర్తి చేయండి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న క్రీడా వికాస కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయించాలని ఆర్డీఓ ఆనందకుమార్‌కి వినతిపత్రం ఇచ్చారు. క్రీడా వికాస కేంద్రంలో షటిల్, టెన్నిస్, క్రికెట్, వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలున్నాయన్నారు. అయితే వాకింగ్ ట్రాక్‌లో ఉన్న ముళ్ల కంపలను తొలగించాలని, టెన్నిస్ కోర్టు 15 అడుగులు పెంచాలని ఇతర అసంపూర్తి పనులు వెంటనే శాప్ అధికారులతో మాట్లాడి పూర్తి చేయించాలని కోరారు. అనంతరం మంత్రి సవితకు సైతం పట్టణ వాసులు వినతిపత్రం అందించి సమస్యలను వివరించారు.న్యాయవాది రాజ్‌కమల్, రఘువీరాచౌదరి, జాన్, నంజుండ, లింగారెడ్డి, సునిల్, అమర్‌నాథ్ రెడ్డి, బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి అడ్డుకట్ట

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లికి చెందిన ఓ బాలికకు ఈనెల 4వ తేదీన వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, మహిళ పోలీసు గ్లోరీ , అంగనివాడీ కార్యకర్త పద్మ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వివాహం చేయమని వారితో రాత పూర్వకంగా హామీ తీసుకున్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళాలు

లేపాక్షి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న లేపాక్షి దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి హిందూపురం పట్టణానికి చెందిన పులిపోట్ల శ్రీనివాసులు సోమవారం రూ.5 వేల ఇటుకలతో పాటు 50 బస్తాలు సిమెంట్‌ను అందజేశారు. అలాగే లేపాక్షికి చెందిన సీ.లక్ష్మీనారాయణ రూ. 20 వేలు విరాళాన్ని అందజేశారు.

పట్టాలు మంజూరు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: సామాజిక సేవా దృక్పథంతో పనిచేస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం తరపున ఇంటి పట్టాలు మంజూరు చేయాలని స్థానిక జర్నలిస్టులు తహసీల్దార్ వెంకటేష్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా పాత్రికేయ రంగంలో ఉంటూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ సమాజానికి ఎంతగానో తోడ్పాటును అందిస్తున్నామన్నారు. అయితే సొంతిళ్లు లేకపోవడంతో అద్దె ఇళ్లలో కాపురం ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయండి



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

హిందూపురం: దేశంలో విచ్చలవిడిగా మత్తు పదార్థాల అమ్మకాలకు తలుపులు తీసి యువతను పెడద్రోవ పట్టించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారులు వేస్తున్నాయని జాతీయ యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కరాజు రామారావు విమర్శించారు. సోమవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రంలోనే ఎక్కడా చూసినా గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు విచ్చల విడిగా రవాణా అవుతున్నాయన్నారు. వీటివల్ల యువత పెడదోవ పడుతోందన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని లేకపోతే ఆందోళనలు శ్రీకారం చుడతామన్నారు.

చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం చెరువులో చేపల పెంపకానికి సోమవారం గ్రామ సచివాలయంలో ఈఓఆర్డీ నాగరాజునాయక్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. దిన్నెహట్టికి చెందిన రంగనాథ్ రూ.56 వేలకు దక్కించుకున్నారని ఈఓఆర్డీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో టిప్పు సుల్తాన్ జయంతిని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం స్థానిక జామియా మసీదు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లో టిప్పు చిత్ర పటాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

పరిగిలో ఓపెన్ ఫోరం

పరిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీడీ విజయేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ మహాత్మ గ్రామీణ పథకంపై ప్రజా వేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగానూ సోషల్ ఆడిట్ నివేదికను చదివి వినిపించారు. దాదాపు రూ.5 కోట్ల 40 లక్షల వ్యయంతో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్‌ను నిర్వహించగా ఇందులో రూ.55 వేలు అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఏపీడీ శివానందనాయక్, డీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

పెనుకొండ: పెనుకొండ మండలంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై మంత్రి సవిత సోమవారం పలువురు టీడీపీ నాయకులతో తన క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. వివిధ పంచాయతీల్లో చేపట్టాల్సిన ప్రధాన పనులపై ఆరా తీశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని మంత్రి తెలియజేశారు.